క్లుప్తంగా

మంత్రి పరామర్శ..



డోర్నకల్: చాప్లాతండా సర్పంచ్ బానోత్ పాండునాయక్ తల్లి జమ్లీ(95) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం మంత్రి సత్యవతి రాథోడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తొర్రూరు: ఎస్సీ గురుకుల పాఠశాలల్లో మిగిలిన ఇంటర్ ఫస్టియర్ సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్థానిక సంక్షేమ బాలికల గురుకులం ప్రిన్సిపాల్ జయశ్రీ పేర్కొన్నారు. సీట్ల భర్తీకి జూన్ 15వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు ఫీజు కింద రూ.100 చెల్లించాలని సూచించారు. ఈఏడాది ఉత్తీర్ణులైన ఎస్సెస్సీ విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ గ్రూపుల్లో ప్రవేశాలు పొందవచ్చన్నారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్. ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కర్త నామిరెడ్డి సీతారాంరెడ్డి, హమేంద్రాదేవి దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు. జమాండ్లపల్లి ఫ్రెండ్స్ యూత్ సభ్యులు వలంటరీగా సేవలందించారు.

సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 22, 36వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణికి సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెరుగు కుమార్ పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం

తొర్రూరు: తొర్రూరు జర్నలిస్టులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించడాన్ని హర్షిస్తూ మండల జర్నలిస్టుల ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలోని గాంధీ విగ్రహం ఎదుట సీఎం కేసీఆర్, మంత్రి దయాకర్‌రావుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు దూలం శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు నాగపురి అశోక్‌గౌడ్, జలగం శేఖర్, జర్నలిస్టులు కృష్ణప్రసాద్, వెంకటరమణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మోగిన బడిగంట

మహబూబాబాద్ రూరల్: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని జంగిలిగొండ సర్పంచ్ పంజాల యాకసాయిలు అన్నారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా గ్రామంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ద్వారానికి కొబ్బరి, మామిడి తోరణాలు కట్టి సంతోషకర వాతావరణంలో విద్యార్థులకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరెడ్డి, ఉపాధ్యాయుడు కార్తీక్, అంగన్వాడీ టీచర్లు ఉపేంద్ర, శ్రీలత, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉచిత సౌకర్యాలతోపాటు నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీడీఓ శేశాద్రి అన్నారు. మండలంలోని నైనాల గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఎంఈఓ గుగులోతు రాముతో కలిసి సోమవారం విద్యార్థులకు యూనిఫాంలు అందజేశారు. క్యాక్రమంలో హెచ్ఎం గాయపు లింగారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ సాయిలు, ఉపాధ్యాయులు రాజు, రాజశేఖర్, సమ్మరాజు, జంపయ్య, మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్ సుధాకర్ పాల్గొన్నారు.

కురవి: ప్రభుత్వ పాఠశాలలు సోమవారం ప్రారంభం అయ్యాయి. మండలంలోని మోద్గులగూడెం జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు హెచ్ఎం శంకర్ నాయక్ యూనిఫాంలు పంపిణీ చేశారు.



డోర్నకల్: యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎంపీపీ

డోర్నకల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎంపీపీ దరంసోత్ బాలునాయక్ తెలిపారు. మండలంలోని తెల్లబండతండా ప్రభుత్వ పాఠశాల నూతన భవనంలో సోమవారం తరగతులను ప్రారంభించిన ఎంపీపీ విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ శ్రీను, ప్రధానోపాధ్యాయులు వీరస్వామి పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలంలో మోగిన బడిగంట 49రోజుల వేసవి సెలవుల అనంతరం సోమవారం మండల పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలలు తిరిగి పునః ప్రారంభం అయినట్లు మండల కేంద్రంలోగల జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ ప్రధానోపాధ్యాయులు, నోడల్ అధికారి శ్రీనువాస్ తెలిపారు.



మహబూబాబాద్ రూరల్: ర్యాలీలో మాట్లాడుతున్న సర్పంచ్ యాకసాయిలు



కురవి: మోద్గులగూడెం స్కూల్‌లో..

పెద్దవంగర: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల బడి గంటల మోగాయి. మండలంలోని ఐదు జెడ్పీ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలో పాటు కస్తూర్బా, జ్యోతిరావ్‌పూలే గురుకుల పాఠశాలలు మొత్తం 34 పాఠశాలలు ఉన్నాయి. అందులో సుమారు 1960 మంది విద్యార్థులకు గాను 418 మంది హాజరైనట్లు నోడల్ హెచ్ఎం అల్లందాసు భిక్షపతి తెలిపారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం..

చిన్నగూడూరు: బాలకార్మికులను నిర్మూలిద్దామని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ నాగవాణి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ మోహన్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం పురస్కరించుకొని చైల్డ్‌లైన్, సత్యార్థి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మండలకేంద్రంలోని ఉపాధి హామీ కూలీలకు మానవ, బాలల అక్రమ రవాణ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 18సంవత్సరాలలోపు బాలబాలికలతో ఎలాంటి ప్రమాదభరిత పనులు చేయించిన చట్టరీత్యా నేరమన్నారు. బాల కార్మికులను వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించి చదువుకునే విధంగా తోడ్పాటు కల్పించాలని చైల్డ్ వెల్ఫేర్ జిల్లా కోఆర్డినేటర్ తప్పెట్ల వెంకటేష్ అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము మల్లయ్య, ఫౌండేషన్ కోఆర్డినేటర్ వసుంధర, చిత్తారి సోమన్న, షీటీం విభాగాల సభ్యులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అమిత్‌షా సభను విజయవంతం చేయండి



మరిపెడ: సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మరిపెడ: ఈనెల 15న ఖమ్మం జిల్లాలో నిర్వహించే కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షా బహిరంగ సభను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచంద్రారావు, రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పిలుపునిచ్చారు. మరిపెడలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. డోర్నకల్ నియోజక వర్గం నుంచి 15వేల మంది పార్టీ కార్యకర్తలను తరలించాలని నాయకులను ఆదేశించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ లక్ష్మణ్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్, మండల అధ్యక్షుడు బింగి రమేష్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షురాలు భూక్య కాంతమ్మ, తాడ పూర్ణచందర్‌రెడ్డి, లింగంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ అధికారం ఖాయం

తొర్రూరు: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ రాష్ట్ర నాయకులు చందుపట్ల సత్యపాల్‌రెడ్డి తెలిపారు. డివిజన్ కేంద్రంలో సోమవారం తొర్రూరు, పెద్దవంగర, రాయపర్తి మండలాల బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర నాయకులు పెదగాని సోమయ్యతో కలిసి సత్యపాల్‌రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ కుటుంబ పాలన కారణంగా ఉద్యమ ఆకాంక్షలు నెరవేరలేదని, పాలన అవినీతిమయంగా మారిందన్నారు. ఈనెల 15న ఖమ్మంలో బీజేపీ ఆధ్వర్యంలో జరిగే భారీ బహిరంగ సభకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా హాజరు కానున్నారని, సభకు భారీగా జనాన్ని తరలించాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, రాష్ట్ర నాయకులు పాకనాటి దామోదర్‌రెడ్డి, కర్ర శ్రీనివాస్‌రెడ్డి, మండలాల అధ్యక్షులు పల్లె కుమార్, బొచ్చు సురేష్, వల్లకొండ రవి, నాయకులు రంగు రాములు, పరుపాటి రామ్మోహన్‌రెడ్డి, గడ్డం నరేందర్, రవిబాబులు పాల్గొన్నారు.

తెలంగాణ ఏర్పాటుతో 'కల్వకుంట్ల'కే లాభం

- ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్

మహబూబాబాద్ రూరల్ : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో కేవలం కల్వకుంట్ల కుటుంబానికే లాభం జరిగిందని, కోట్లాది మంది ప్రజల ఆకాంక్షను బీఆర్ఎస్ సొమ్ము చేసుకుందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అన్నారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాజీవ్ గాంధీ ఆన్ లైన్ క్విజ్ కాంపిటీషన్ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా కేంద్రంలోని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ నివాసం వద్ద సోమవారం నిర్వహించారు. సమావేశానికి వెంకట్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఎన్ఎస్‌యూఐని మండల స్థాయి నుంచి బలోపేతం చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి 20వేల ఓట్లు వచ్చే విధంగా ఎన్ఎస్‌యూఐ కృషి చేస్తుందన్నారు. యావత్ తెలంగాణ ప్రజానీకం కాంగ్రెస్ అధికారంలోకి రావాలని చూస్తుందన్నారు. ఆన్‌లైన్ కాంపిటీషన్ అంశాలపై టీపీసీసీ, ఏఐసీసీ నుంచి పర్యవేక్షణ చేస్తారన్నారు. ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్న వారికి కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, హెచ్.వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, చంటి, స్వామి, ఉపేందర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రియాజ్ అన్సారీ, జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోత్ వంశీ, సంఘం నాయకులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బల్మూరి వెంకట్, కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్

చెడువ్యసనాలకు దూరంగా ఉండాలి

గార్ల: ధూమపానం, మద్యానికి యువత దూరంగా ఉండాలని బహుజన్ వలంటరీ ఫోర్స్ రాష్ట్ర కన్వీనర్ రాకేష్ సూచించారు. సోమవారం గార్లలో బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో యువతకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసంస్థ ద్వారా యువతీ, యువకులకు శరీర ధారుఢ్యం, ఫిజికల్ ఫిట్‌నెస్, కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తుందని, ఇల్లందు నియోజకవర్గం లోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ ఇల్లందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాదావత్ ప్రతాప్, మండల అధ్యక్షుడు వెంకన్న, చిన్న, గాంధీ, జీవన్, వాసు, రామ్‌కుమార్, వాగ్యా, నరేష్, సంపత్ పాల్గొన్నారు.

బయ్యారం: బంగారు భవిష్యత్‌ను పక్కదారి పట్టించే చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని బీఎస్పీ ఇల్లందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధావత్ ప్రతాప్ అన్నారు. బయ్యారంలో సోమవారం నిర్వహించిన బహుజన్ వలంటరీ ఫోర్స్(బీవీఎఫ్) శిక్షణా తరగతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. యువత భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో బీవీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రాకేష్, బీఎస్పీ మండల అధ్యక్షులు కొత్త వినయ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



గార్ల: యువకులకు శిక్షణ ఇస్తున్న కన్వీనర్ రాకేష్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్: పొట్టకూటి కోసం వెళ్లి తిరిగి వస్తుండగా అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని కొత్త కలెక్టరేట్ సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గుల్లకుంట కాలనీలో నివాసం ఉండే ధర్మారపు ఇద్దయ్య (62) చెప్పులు కుట్టుకుని తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో కురవి మండల కేంద్రంలో జరిగిన సంతలో కూడా చెప్పులు కుట్టేందుకు వెళ్లాడు. తిరిగి రాత్రి సమయంలో ఇంటికి ఆటోలో వస్తున్నాడు. ఆటోలో అతనితోపాటు కత్తులు, గొడ్డళ్లు అమ్ముకునే వారు ఎక్కారు. ఆ ఆటో కొత్త కలెక్టరేట్ సమీపంలోకి రాగానే గేదె అడ్డు వచ్చి ఆటో బోల్తాపడి అందులో నుంచి ఇద్దయ్య కిందపడి తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగానే ఆయన మృతిచెందాడు. కాగా ఇద్దయ్య ఆటో బోల్తాపడి గాయాలపాలై మృతిచెందలేదని, ఆయనతో ఆటోలో వచ్చిన మరి కొందరు వ్యక్తులు కత్తులతో గొంతు కోసి, తలపై బలంగా కొట్టడం వల్లే మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. జరిగిన సంఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కేసముద్రం: ఇనుగుర్తి గ్రామానికి చెందిన ఎం.సంతోష్ అనే వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న బూరుగుమళ్లకు చెందిన బానోత్ రమేష్, శిరీష్ బైక్ కేసముద్రంవిలేజ్‌లోని దర్గా వద్ద ప్రమాదవశాత్తు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ముగ్గురికి స్వల్పగాయాలు కాగా, 108లో మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ వీరన్న, పైలట్ వెంకన్న తెలిపారు.

ఉపాధి హామీ పనుల్లో అవినీతి

గంగారం: మండలంలో వివిధ గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన వందరోజుల పనిలో అవినీతి జరిగిందని, అవినీతిపై తక్షణమే విచారణ చేపట్టాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర సంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం అధికారులు కొన్ని రోజులుగా సోషల్ ఆడిట్‌ను గ్రామపంచాయతీల వారీగా కొంత మంది ప్రైవేట్ సిబ్బందిని పుర్మాయించి ఉపాధి పనుల్లో ఎలాంటి సమస్యలు లేనట్లుగా, వారు చేసిన పనులను డబ్బులు ముట్టినట్లుగా సంతకాలు చేయించుకున్నారని తెలిపారు. తక్షణమే ఉన్నతాధికారులు ప్రజల సమస్యలను పరిష్కరించాలని లేదంటే పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మంగయ్య, వెంకన్న, రాకేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవి

'చట్ట బద్ధత కల్పించడంలో విఫలం'

నెల్లికుదురు: అధికారంలోకి వచ్చిన 100రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని గొప్పలు చెప్పిన బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలం చెందిందని, ఇప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ శాగంటి రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక విశ్రాంతి భవనంలో సోమవారం బిర్రు యాకయ్య మాదిగ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9ఏళ్లు గడుస్తున్న నేటికీ వర్గీకరణను ఎందుకు చేయడం లేదన్నారు. అలసత్వం ఎందుకని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు పోలెపాక ప్రవీన్ మాదిగ, వెంకన్న, గడ్డమీద వెంకన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

డోర్నకల్: స్థానిక డీడీ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు తెలుగు /సంస్కృతం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఎండలు తీవ్రంగా ఉండడంతో పరీక్షా కేంద్రంలో విద్యార్థుల కోసం పటిష్ఠ ఏర్పాట్లు చేశారు.

బీసీలందరికి రూ.లక్ష ఇవ్వాలి

గార్ల: బీసీ కులస్తులందరికీ రూ.లక్ష ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మాలోత్ వెంకట్ లాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడారు. నాయకులు కృష్ణగౌడ్, నానిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవంగర: బీసీ కులవృత్తుల వారు ప్రభుత్వం అందించే లక్ష రూపాయల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రజక సంఘం మండల అధ్యక్షుడు బోనగిరి లింగమూర్తి సోమవారం అన్నారు. కార్యక్రమంలో నాయకులు బానోతు వెంకన్న, కుకట్ల వీరన్న పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

డోర్నకల్: మండలంలోని గొల్లచర్ల శివారు తాటివనంలోని కంఠమహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విగ్రహ పునఃప్రతిష్ఠా వేడుకలు వైభవంగా జరిగాయి. మధ్యాహ్నం గౌడ కులస్థులు బోనాలతో ఊరేగింపు నిర్వహించి ఆలయంలో బోనాలు చెల్లించారు.

ఆర్థికసాయం

కేసముద్రం: మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు అమీర్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.25వేల ఆర్థికసాయం సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నజీర్ అహ్మద్, కార్యదర్శి ఏకాంతం పాల్గొన్నారు.

మార్చురీలో మృతదేహం

కురవి: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు ఆదివారం రాత్రి మృతి చెందగా, మృతదేహాన్ని మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు సోమవారం కురవి ఎస్సై బి.రాము తెలిపారు. మృతదేహానికి సంబంధించిన ఎవరైనా ఉంటే కురవి పోలీసులను సంప్రదించాలని సూచించారు.

క్షీరాభిషేకం

పెద్దవంగర: దివ్యాంగుల పింఛన్ పెంపును హర్షిస్తూ సోమవారం మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్షురాలు శివరాత్రి సుగుణమ్మ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి దయాకర్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, నాయకులు దుంపల సమ్మయ్య, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఎండీ ముజీబ్ పాల్గొన్నారు.

అనుమతి లేని ప్లాంట్లపై చర్య తీసుకోవాలి

తొర్రూరు: పట్టణంలో అనుమతి లేని వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని పట్టణ నివాసి బదావత్ సరోజ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అభిలాష అభినవ్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

గిరిజనులకు రిజర్వేషన్లు పెంచాలి

తొర్రూరు: జనాభా దామాషా ప్రకారం రాష్ట్రంలోని గిరిజనులకు రిజర్వేషన్ల శాతం పెంచాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ కోరారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నా కరపత్రాలను సోమవారం డివిజన్ కేంద్రంలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాటోత్ బాలునాయక్, రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌నాయక్, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు కేశవ్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రంలో చోరీ

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామంలోని నిమ్మ శ్రీనివాస్‌కు చెందిన మీ సేవ కేంద్రంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మీ సేవా కేంద్రం షటర్ పగలగొట్టి అందులోని కౌంటర్‌లో ఉన్న డబ్బులు రూ.10వేలు దొంగిలించారు. ఈ విషయమై నిమ్మ శ్రీనివాస్ రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. జమాండ్లపల్లి గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

చెరువుల పండుగ చేయడం సిగ్గుచేటు

బయ్యారం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బయ్యారం పెద్దచెరువు అభివృద్ధికి ఒక్క రూపాయి ఖర్చు పెట్టకుండా పాలకులు చెరువుల పండుగ చేయటం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ ఇల్లందు నియోజకవర్గ నాయకురాలు బానోత్ విజయలక్ష్మి సోమవారం అన్నారు. బయ్యారం పెద్దచెరువుకు సీతారామనీళ్లను తేవటంతోపాటు పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని మంత్రి సత్యవతిరాథోడ్ ఎమ్మెల్యే హరిప్రియ పలుమార్లు ప్రకటించినప్పటికి ఆచరణలో అమలు చేయలేదన్నారు. రానున్న కాంగ్రెస్ పార్టీ పాలనలో బయ్యారం పెద్దచెరువును అభివృద్ధి చేస్తామన్నారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైస్ మిల్లులో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న నైనాల గ్రామానికి చెందిన వెంకటాద్రి రోడ్డుపై తన పర్సు సోమవారం పోగొట్టుకున్నాడు. ఈక్రమంలో ఇనుగుర్తి గ్రామానికి చెందిన లింగాల నర్సయ్యకు రోడ్డుపై పడ్డ పర్సు దొరికింది. పర్సులో చూడగా రూ.11వేలతోపాటు ఫొటో, ఆధార్‌కార్డు ఉండడంతో వెంటనే ఆధార్ కార్డు అధారంగా వెంకటాద్రికి సమాచారం అందించాడు. ఈమేరకు అతనికి పర్సు అప్పగించి నర్సయ్య తన నిజాయితీని చాటుకున్నాడు.

బీజేపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధం

గార్ల: మోదీ తాము అధికారంలోకి వస్తే ప్రజలకు అచ్చేదిన్ తీసుకొస్తానని చెప్పి, సచ్చేదిన్ తీసుకొస్తున్నాడని పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు గౌని భద్రయ్య ఆరోపించారు. సోమవారం పీవైఎల్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గార్లలో పీవైఎల్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. త్వరలో 5రాష్ట్రాల్లో జరుగనున్న ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారన్నారు. నాయకులు రవి, బాబూరావు, శంకర్, వీరన్న పాల్గొన్నారు.

ఘన నివాళి

నెహ్రూసెంటర్: పీవైఎల్ నాయకుడు పొన్నం చంద్రశేఖర్ మృతిచెందగా పార్టీ, ప్రజాసంఘాల నాయకులు సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంతాప సభ, ర్యాలీ నిర్వహించగా నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, అనురాధా, రాజేందర్, వెంకటయ్య, శ్రీశైలం, శ్రీధర్, చైతన్య నివాళులర్పించారు.

మూడు రోజులుగా విద్యుత్ సరఫరా బంద్

తొర్రూరు రూరల్: మండలంలోని కర్కాల గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌లో అంతరాయం ఏర్పడడంతో మూడు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను అందించాలని కోరుతున్నారు.

'మహిళా దివస్' ఏర్పాట్ల పరిశీలన



కేసముద్రం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో మహిళా దివస్ ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈమేరకు సోమవారం అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లను పరిశీలించి సమీక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ సీతామహాలక్ష్మి, ఎంపీపీ ఓలం చంద్రమోహన్, జెడ్పీటీసీ శ్రీనాథ్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ రమాదేవి, నోడల్ అధికారి సూర్యనారాయణ, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాదారపు సత్యనారాయణరావు, ఎంపీడీఓ రవీందర్‌రావు, బీఆర్ఎస్ నేత నీలం దుర్గేష్, మండల అధ్యక్షుడు ఎండీ నజీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

మహిళలను భాగస్వాములను చేయాలి

తొర్రూరు: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో మహిళలను భాగస్వాములను చేయాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య కోరారు. సోమవారం పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో మహిళా సంక్షేమ సభపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కమిషనర్ సింగారపు కుమార్, వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పెద్ద దిక్కును కోల్పోయాం..



కొత్తగూడ: ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ అకాల మరణం కొత్తగూడ, గంగారం మండలాలకు పెద్ద దిక్కును కోల్పోయినట్లు అయిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జగదీష్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొనేందుకు తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు బానోతు నెహ్రూ, లింగన్న, రవి, సూరయ్య, యాదగిరి పాల్గొన్నారు.

గంగారం: పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో కుసుమ జగదీష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఈసం సమ్మయ్య, ఇర్ప సూరయ్య, బాలాజీనాయక్ పాల్గొన్నారు.

బీసీ రుణాల్లో గౌడ కులస్తులను కలపాలి



గార్ల: బీసీ రుణాల్లో గౌడ కులస్తులను కలపాలని కోరుతూ సోమవారం గౌడ కులస్తులు గార్లలో ప్రదర్శన నిర్వహించి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈధర్నాను ఉద్దేశించి గౌడ సంఘం నాయకులు మాట్లాడారు. బీసీ రుణాలతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో కల్లుగీత కార్మికులకు గీత బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ధర్నా అనంతరం ఎంపీఓ రజిని కి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షులు మంద రవిగౌడ్, కోల కుమార్‌గౌడ్, నాయకులు కత్తి సత్యం, తాళ్లపల్లి కృష్ణ, కందునూరి శ్రీనివాసరావు, తోడేటి శ్రీను పాల్గొన్నారు.

కాలిన పామాయిల్ చెట్ల పరిశీలన

నర్సింహులపేట: మండలంలోని బొజ్జన్నపేటలో కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు కాలిన పామాయిల్ చెట్లను సోమవారం హెచ్ఓ రాకేష్ పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు.